క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంపీడీఓగా హరికృష్ణ

మెరకముడిదాం: మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా పీఆర్ ఏఈ హరికృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసిన పి.రామకృష్ణ పదోన్నతిపై గుంటూరు జిల్లాకు వెళ్లారు. పూర్తి స్థాయిలో ఎంపీడీఓ నియమితులయ్యే వరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా హరికృష్ణకు ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు.

గొల్లుపాలెంలో 'ఫ్యామిలీ డాక్టర్'



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి ఝాన్సీ

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెంలో దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జె.ఝాన్సీ ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్ర మం నిర్వహించారు. ముందుగా శిబిరం ఏర్పాటు చేసి ఓపీ(అవుట్ పేషెంట్) 92 మందికి సేవలు అందించారు. అయిదుగురు గర్భిణులకు వైద్యతనిఖీలు చేశారు. అనంతరం గృహసందర్శన చేసి ప్రజలకు వైద్యపరీక్షలు చేశారు. హెల్త్ సూపర్ వైజర్ బోధ నారాయణ అప్పలనాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

జామి: మండలంలోని భీమసింగి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాదవితరణ చేశారు. కల్యాణ వేడుకల్లో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ ఎండీ విక్టర్‌రాజ్, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సతీమణి, దేవీ అనూరాధ, జెడ్పీటీసీ గొర్లె సరయు, పాలక వర్గం సభ్యులు ఎన్నింటి ఆదిలక్ష్మి దంపతులు, పాండ్రంకి సంజీవి, తోట మధుసూదనరావు, ఎంపీటీసీ కంది పద్మావతి తదితరులు పాల్గొన్నారు. గురువారం ఉదయం సుప్రభాతం, ఆరాధన, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం



రైతులకు ఆయిల్ ఇంజిన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు

దత్తిరాజేరు: అన్నదాతలకు అన్ని విధాలా అండగా ప్రభుత్వం నిలుస్తోందని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మరడాం గ్రామంలో ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన పథకంలో భాగంగా రైతులకు రాయితీపై ఆయిల్ ఇంజిన్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధిని వేగవంతం చేయండి



పనులను పరిశీలిస్తున్న తిరుమలరావు తదితరులు

గజపతినగరం: 'అమృత్ సరోవర్' పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎంపిక చేసిన చెరువుల్లో ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సోషల్ ఆడిట్ డీఆర్పీ తిరుమలరావు ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. లింగాలవలస, జిన్నాం, కెంగువ గ్రామాల్లో చేపడుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో వేతన దారుల కోసం చేసిన ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ పప్పు సుదర్శనం, ఇరిగేషన్ డీఈ పాండు, ఏపీఓ సీహెచ్.రామారావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ ఎస్.కృష్ణమూర్తి గురువారం ఓ ప్రకటన లో తెలిపారు. విద్యుత్ తీగలకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. గజపతినగరంతో పాటు పురిటి పెంట, ఎం.వెంకటాపురం, మదుపాడ డెయిరి, ఎస్.జి.ఆర్.పురం లేఅవుట్ ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ఆశయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



గంట్యాడ: మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం అని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని జగ్గాపురం గ్రామంలో గురువారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ సంక్షేమ పథకాల అమలులో సీఎం జగన్ మోహన్‌రెడ్డి నూతన ఒరవడి సృష్టించారన్నారు. దళారుల ప్రమేయం, సిఫార్సులకు తావులేకుండా, పార్టీలను చూడకుండా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. వలంటీర్లు నేరుగా ప్రజల ఇళ్లకు వెళ్లి పథకాలు అందిస్తున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ వారికే పథకాలు అందేవని, పింఛను పొందుతున్న వారిలో ఎవరైనా చనిపోతే కాని కొత్తవారికి పింఛను వచ్చేది కాదని గుర్తు చేశారు. ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.విజయ్ పాల్గొన్నారు.

ఇది పేదల ప్రభుత్వం

చీపురుపల్లిరూరల్(గరివిడి): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం పాటుపడే ప్రభుత్వమని, అన్ని వర్గాల ప్రజలకు ఈ ప్రభుత్వంలో న్యాయం జరుగుతోందని గరివిడి మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వ రరావు అన్నారు. గరివిడి మండలం అర్తమూరు గ్రామంలో గరివిడి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు గురువారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గడప గడపకూ వెళ్లి పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక సర్పంచ్ పొన్నాడ కుమార్, ఎంపీటీసీ పతివాడ గురునాయుడు, వైస్ సర్పంచ్ జి.పైడితల్లినాయుడు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములునాయుడు, కోనూరు పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, ఎంపీటీసీ కడుమల రాంబాబు, నాయకులు గుడివాడ తమ్మినాయుడు, అలమండ అప్పలనాయుడు, పోలీస్‌నాయుడు, ముద్దాడ రమణ, జగదీష్,సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం పనిచేస్తే గరిష్ట వేతనం



వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ పెదఅప్పలనాయుడు

మెరకముడిదాం: నిబంధనల ప్రకారం ఉపాధి హామీ పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ వేతనం రూ.272 అందు తుందని ఉపాధి హామీ ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని సోమలింగాపురం, బుధరాయవలస గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. వేతనదారులతో ఆయన మాట్లాడుతూ రెండుపూటలా పనులకు హాజరు కావాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమచికిత్స కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు పైడిరాజు, ఆదినారాయణ ఉన్నారు.

క్రీడాకారిణికి అభినందనలు



క్రీడాకారిణి నీలిమను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన ఎస్.కోట క్రీడాకారిణి బుత్తల నీలిమను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు గురువారం అభినందించారు. మే 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు చిత్తూరు జిల్లా తిరుపతిలో నిర్వహించిన సీఎం కప్ మహిళల ఆహ్వాన కబడ్డీ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు ద్వితీ య స్థానంలో నిలిచిందని, 20,21 తేదీల్లో నిర్వహించిన అండర్–19 స్కూల్‌గేమ్స్‌లో జిల్లా జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్టు కోచ్ తాతబాబు వివరించారు. ఈరెండు విజయాల్లో కీలక పాత్ర పోషించిన స్థానిక కబడ్డీ క్రీడాకారిణి నీలిమను ఎమ్మెల్సీ రఘురాజు అభినందిస్తూ.. మరింత సాధనచేయాలని, ఆటను వదిలేయవద్దని, జట్టుకు మరిన్ని విజయాలు అందించటంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఎటువంటి సహాయం కావాలన్నా తన సహకారం ఉంటుందని చెప్పారు.

ముగిసిన వేసవి క్రీడా శిబిరం



శిక్షణకు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నెలరోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ షటిల్ క్యాంప్ ముగింపు సంబరాలను కోచ్ పి.శ్రీరాములు నేతృత్వంలో గురువారం నిర్వహించారు. నెల రోజుల పాటు శిబిరంలో నేర్చుకున్న క్రీడా నైపుణ్యాలను విద్యార్థులు ప్రదర్శించారు.అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా కోచ్ శ్రీరాములు క్రీడా శిబిరాలు నిర్వహిస్తూ ఎందరో క్రీడాకారులను తయారు చేశారని, వారిలో చాలామంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తు న్నారని, అభినందించారు. క్రీడలు శారీరక, మానసిక, మేథో వికాసానికి ఉపకరిస్తాయని, క్రీడలు వద్దని మీ పిల్లల్ని వారించొద్దని, ఏదైనా ఒక క్రీడలో నైపుణ్యం సాధించేలా ప్రోత్సహించండని తల్లిదండ్రులను కోరారు. కోచ్ శ్రీరాములు మాట్లాడుతూ శిబిరం నిర్వహణకు సుమారు రూ.2 లక్షలు ఖర్చు అయ్యిందని, ఆ మొత్తాన్ని సమకూర్చిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బ్యాడ్మింటన్, యోగా, డ్రాయింగ్ పోటీల్లో సత్తా చాటిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, ఎఫ్ఆర్‌సీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సత్యశేఖర్, విశ్రాంత ఉపాధ్యాయుడు మండా జోగారావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ తగరంపూడి రమణ, విశ్రాంత ఆర్మీఉద్యోగి పి.వెంకటరావు, కె.సతీష్, ఆర్.రాజా, రేపాక రాము, డోకుల నాయుడు, జాన కేశవ, బి.హారిక, పి.మౌనిక, పలువురు బ్యాడ్మింటన్ క్రీడాకారులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభం రేపు



సచివాలయభవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేటలో గ్రామ సచివాలయం, హెల్త్ వెల్‌నెస్ కేంద్రం నూతన భవనాలను ఈనెల 3వ తేదీన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రారంభించనున్నట్లు ఎంపీపీ సత్యవంతుడు తెలిపారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఏర్పాట్లపై స్థానిక సర్పంచ్‌కు పలు సూచనలు చేశారు. ఎంపీపీ వెంట ఎంపీడీఓ పట్నాయక్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బాధ్యతతో విధులు నిర్వర్తించాలి

వేపాడ: వలంటీర్లు బాధ్యతతో, సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అన్నారు. మండలంలో మూడు వలంటీర్ పోస్టుల ఖాళీల భర్తీకి అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికై న వారికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నియామక పత్రాలను అందజేశారు. ఎంపీడీఓ పట్నాయక్, సర్పంచ్ వడ్లమాని శర్మ, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వేపాడ: వలంటీర్‌కు నియమాక పత్రం అందజేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు

నేడు ఆర్బీకే భవనం ప్రారంభం



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లిరూరల్: పెదనడిపల్లి గ్రామంలో రైతుభరోసా కేంద్రాన్ని(ఆర్బీకే) శుక్రవారం సాయంత్రం 4గంటలకు రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం,వలిరెడ్డి శ్రీనివాసులనాయడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి పనుల ప్రారంభం అనంతరం గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం ' కార్యక్రమం ఉంటుందని చెప్పారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు,ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కూడా హాజరవుతారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కోరాడ పృథ్వీరాజ్, రెల్లి శివ పాల్గొన్నారు.

తొలిరోజే 95 శాతం పింఛన్ల పంపిణీ



దత్తిరాజేరు: గడసాంలోదివ్యాంగుడికి పింఛను అందజేస్తున్న వలంటీరు



గజపతినగరం: కొత్తశ్రీరంగరాజపురంలో వృద్ధుడికి పింఛను అందజేస్తున్న వలంటీర్, సర్పంచ్

గజపతినగరం/ దత్తిరాజేరు: గజపతినగరం, దత్తిరాజేరు మండలాల్లో జూన్ నెలకు సంబంధించిన సామాజిక పింఛన్ల పంపిణీ 1వ తేదీనే 95 శాతం పూర్తయిందని ఆయా మండలాల ఎంపీడీఓలు పప్పు సుదర్శనం, సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. గ్రామ వలంటీర్లు ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి బయోమెట్రిక్ నమోదు చేసుకుని పింఛను డబ్బులు అందజేశారు.

అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయం



స్కావెంజర్లకు నియామకపత్రాలను అందజేస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలలో రోజువారీ పద్ధతిలో స్కావెంజర్లుగా పనిచేస్తున్న ఆరుగురిని ఆప్కాస్(ఏపీ కార్పొరేషన్ ఫర్ అవుట్‌సోర్స్‌డ్ సర్వీసెస్)లో కలుపుతూ ప్రభుత్వం నుంచి వచ్చిన నియామక పత్రాలను వారికి ఎంపీపీ గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిత్త శుద్ధితో విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్

వేపాడ:

మండలంలోని జాకేరు గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ గురువారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించి, ఈసేవలపై సిబ్బందిని ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ, బాధ్యతతో విధులు నిర్వర్తించాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

ఉపాధ్యాయుల ఇంటింట ప్రచారం



ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న ధర్మవరం హైస్కూల్ ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: ధర్మవరం ఉన్నత పాఠశాలలో బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలో పిల్లలను చేర్పించాలని కోరుతూ ఆ పాఠశాల ఉపాధ్యాయులు ధర్మవరం, పోతనాపల్లి, మామిడిపల్లి గ్రామాల్లో గురువారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని, ప్రత్యేకంగా బాలికల కోసం ఏర్పాటు చేసిన కళాశాలలో మీ పిల్లలను చేర్పండి అంటూ తల్లిదండ్రులను కోరారు. పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు, డిజిటల్‌లైబ్రరీ, కంప్యూటర్‌ల్యాబ్, యూనిఫాం అధ్యాపక సిబ్బంది వంటి అన్ని అంశాలను వారికి వివరించి, పాఠశాలలో జాయిన్ చేస్తే ఉత్తమ విద్యాబోధనతో పాటూ వ్యక్తిగతంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. మంచి ఫలితాలు సాధించే దిశగా మీ పిల్లలను తీర్చిదిద్దుతామని, ఉపాధ్యాయుల కొరత లేదని తల్లిదండ్రులకు వివరించారు. ఉపాధ్యాయులు రహీంషేక్ లాల్, ఎస్.వి.ఎస్.ఎన్.మూర్తి, పి.శివాజీ, టి.రాజేష్, కె..జయలక్ష్మి, ఏ.సురేంద్రనాథ్, సీఆర్పీ సూర్యారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో 'మిషన్ లైఫ్'



ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో చెత్త, వ్యర్థాలను తొలగిస్తున్న అధికారులు

బొండపల్లి: మండల సముదాయంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో గురువారం 'మిషన్ లైఫ్ కార్యక్రమం' నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణాల్లో ప్లాస్టిక్‌తో పాటు చెత్త చెదారం ఏరివేసి, మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎంపీడీఓ ఏ.వేదవతి ఆధ్వర్యంలో మండల అధికారులు,సిబ్బంది అంతా కలిసి ప్రభుత్వ కార్యాలయాల్లో చెత్తను ఏరివేసి, మొక్కలు నాటారు. ఏపీఓ బి.కృష్ణవేణి, ఈసీ సన్యాసిరావు, సీనియర్ సహాయకులు డి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు

కొత్తవలస: డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు స్థానిక వాగ్దేవి పీజీ, డిగ్రీ కళాశాలలో గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 70 మంది యువకులు హాజర య్యారని కళాశాల కరస్పాండెంట్ కె.మహేశ్వరరావు తెలిపారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రకాష్‌రావు



గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పి.ఎల్.ఎన్.ప్రకాష్‌రావు పట్నాయక్ గురువారం బాధ్యతలు స్వీక రించారు. ఇదివరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా సీహెచ్.విజయకుమారి పనిచేశారు. ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావుకు అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలిపారు.

వృత్తిపై అంకిత భావం అవసరం



హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణను సన్మానిస్తున్న ఎస్‌ఐ కిరణ్‌కుమార్ నాయుడు

గంట్యాడ: ఏ రంగంలోనైనా వృత్తిపై అంకితభావం అవసరమని ఎస్‌ఐ కె. కిరణ్‌కుమార్ నాయుడు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి వివిధ పోలీస్ స్టేషన్‌లకు బదిలీపై వెళుతున్న పోలీసులకు గురువారం సన్మానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ పోలీస్ కృషి చేయాలన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం

డెంకాడ: వైఎస్సార్ భరోసా– పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గురువారం పథకాన్ని ప్రారంభించగా..ఈ కార్యక్రమాన్ని మండలంలోని మోపాడ గ్రామ సచివాలయంలో వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వాసుదేవరావు, ఏఓ పూడి నిర్మల మాట్లాడుతూ, పథకం ద్వారా ప్రతి రైతుకూ రూ. 13,500 అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బడుకొండ రమేష్. తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు తప్పనిసరి

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ పొదుపు చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని విద్యుత్ శాఖ ఎస్ఈ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సింగ్‌పూర్ సిటీ అపార్ట్‌మెంట్‌లో 'పొదుపు చేయండి – పర్యావరణాన్ని కాపాడండి' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, విద్యుత్ నిత్య జీవితంలో భాగమైందన్నారు. విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపు పాటించాలని సూచించారు. భవిష్యత్ తరాల వారికి మెరుగైన సమాజాన్ని అందించాలంటే ఇప్పటి నుంచే పిల్లలకు పొదుపుపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అపార్ట్‌మెంట్ వాసులతో విద్యుత్ పొదుపు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.